


# గుణాంతరం

## – నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల

### (గత సంచిక తరువాయి)

**చివరిమాటలంటూండగా** రాయుడు ఫోను తెంపేశాడు. ప్రేమలత తనతోపాటు వచ్చేస్తాననడం అతని మనసు నుంచీ కొండంత భారాన్ని దించినట్టు కూడా. ఇక రంగా గాడి బాధా ఉండదు. ప్రేమలత ఇప్పుడు అచ్చంగా రాయుడిది. పరిశీలించి చూడాలేగాని, ప్రతి అంశం నుంచీ, ఏదో ఒక ఊరట ఉండకపోదు.

## 8. ఉడుం ఎగబాకుడు

యథావిధిగా సుమతి రాయుడి రాకకై ఎదురుచూస్తూ నిలబడింది. ప్రతిరోజు ఏవిటో ఈ మనిషి అని అనుకుంటూ ఉంటుంది. దానర్థం ప్రతిరోజు తాను అతని గురించి ఎదురుచూస్తూ నిలబడటం కాకుండా ఆ అవసరం లేని విధంగా ఒకరోజు కాకపోతే ఒక రోజు అతను ఆమె గురించి చూడ వచ్చు కదా అని, సర్దుకు పోతూనే ఉంది.

“మీరు నా గురించి ఎదురు చూసే రోజు వస్తే దాన్ని చూసి ముచ్చట పడాలని ఉంది,” అనింది రెండు మూడు సార్లు.

"ఇలాంటివి చాలా చిన్న విషయాలు, సుమతి. నీవు సుమతివి. పంతాలు పట్టింపులకు అనవసరమైనవి. దీన్ని నా గురించి చేస్తున్న చిన్న త్యాగంగా భావించా వనుకో దాని వల్ల కలిగే బాధ ఉండదు. నీ దృష్టికి నీ ఔన్నత్యం అధికంగా కనిపిస్తుంది. అంతేకాక నీవు నా గురించి ఎదురు చూస్తున్నావు అన్న భావన నీ పట్ల నా ఇష్టాన్ని అధికంచేస్తుంది. ; ఈ విషయంలో నాకు కాస్త గర్వపడే అవకాశం ఇచ్చిన దానివి అవుతావు," అన్నాడు.

అతనితో పరిచయం అయిన కొత్తల్లో ఇతగాడు వింత మనీషా, వింత పశువా అని అనుకొనేది.

పొద్దున్న ఆరుగంటలకల్లా వచ్చి రాయుడి గురించే ఎదురుచూసింది. పది నిమిషాలవుతున్నా అతని జాడలేదు. ఫోను చేసింది విసుగ్గా. దానికీ  కొత్తగా కొన్న ఆటలబూటును వేసుకుని నాలుగోరోజు నుంచీ అనంతం బీచికి వెళుతున్నాడు. ఆ రోజు ఆమెను  దూరాన్నుంచీ చూసి ఆమెకు దగ్గిరగా నడిచాడుఎలాంటి స్పందనా లేదు. ఈ రోజు వస్తే ఒచ్చాడు, లేకపోతె  చచ్చాడు, నేను ఒంటరిగా వెళతాను అని కోపం కొద్దీ ఒక్కర్తే నడవడం మొదలుపెట్టింది. తన వెనకనే వస్తాడు; అతనూ అటునుంచీ వచ్చేటప్పుడు ఎదురవుతాడులే అనుకుంది. వెళ్లి తిరుగుముఖం పట్టినపుడు అతను ఎంతకూ ఎదురవ్వలేదు. పదేపదే ఫోను చేసినా ఫలితంలేకపోయింది. ఎందుకలా జరిగిందో ఎంత ఆలోచించినా అంతుపట్టలేదు. ఒంట్లోబాగాలేకపోయినా, ఉన్నట్టుండి పనిమీద ఊరు ఒదిలి వెళ్ళవలసి వచ్చినా కనీసం తనకు ఫోను చేసి చెప్ప వలసింది. లేదూ, తానే అతనికి ఫోను చేసినప్పుడన్న (అరగంటా ముప్పావుగంటలో అనేక సార్లు చేసినపుడన్న) ఎస్సెమ్మెస్ అన్నా పంపవచ్చు. ఇంటికి తిరిగి వచ్చి స్నానం, ఫలహారం వగైరాలు కానిచ్చి కార్యాలయానికి వెళ్ళింది. మధ్యాహ్నం వార్త వచ్చింది. అందరూ ఆశ్చర్యపోయారు. రెండు లేఖలు వచ్చాయట. ఒకటి శలవు కావాలని, రెండవది తనను తన అసలు డిపార్టుమెంటుకు పంపించెయ్యమని. ఆ రోజు సాయంత్రం అతని ఫ్లాట్ కు వెళదామా అనుకుంది. అతనికి విషయం తనకు చెప్పాలన్న ఖాతరులేనప్పుడు అతన్ని వెదుక్కుంటూ తాను ఎందుకు వెళ్లడం అనుకుంది. ప్రేమలతుంటే?  అతనికి తన శరీరంతోనే పని గాని, మనసుతో ఏమి పని? పరాయిస్త్రీతో సంబంధం కలిగి ఉండటం ఒక గర్వించదగిన భావననుందేమోకూడా. గతంలో అలా అనుకునేది. ఇప్పుడు అది నిజమని తేలుతోంది. ఇద్దరి మధ్యది ఒక పశువుకు మరొక పశువుతో గల సంబంధం. ఆమె ఆ రోజు సరిగా పనిచెయ్యలేకపోయింది. శలవు పెట్టి వెడితే సహచాఉద్యోగులకు కాలక్షేపంగా తమ మధ్యనున్న అంశం మరోసారి దొరుకుతుంది. ఎలాగో కార్యాలయంలో గడిపింది ఆఖరిదాకా. సహచరులు తన దగ్గిరికి ఒకరి తరువాత ఒకరు రావడం తన హావభావాలు గమనించడం ఆమెకు తెలుస్తూనే ఉంది. తాను పరిహాస్పదంగా ఏనాడో మారింది, ఈరోజేం కర్మ?

రెండో రోజు పొద్దున్న అతనిగురించీ ఎదురుచూడటం, ఫోను చెయ్యడం చేసింది ఏదో ఆసక్తితో. అహానికి, హృదయానికి  అయిన గాయానికి ఏ మందు వేయాలో ఎలా వేయాలో అర్థం కాలేదు. వాకుకు  వెళ్లకుండా ఇంటికి వెనక్కువెళ్ళిపోదామని కొన్ని నిమిషాలపాటు అనిపించింది. అతని పై తిరుబాటుగా ఆమెకు చేతనయిన ఒక పని ఆమెకు తోచింది. అదే, అతని గురించీ చూడకుండా ఎప్పటిలా తాను నడిచేంత దూరం నడవడం. రేపటి నుంచీ కూడా తన పొద్దుటి నడక మానకూడదన్న నిర్ణయానికొచ్చింది. అలా అనుకుంటున్నపుడు గొంతు పూడుకుపోయింది.

మూడో రోజు అతని గురించీ చూడకుండా ఆమె నడుస్తోంది. నడిచే దారిలో ఏ మార్పు లేదు. సముద్రం అక్కడే ఉంది. నెలలుగా తనకు తోడుగా, తన శరీరాన్ని అప్పుడప్పుడూ తాకుతూ ఏదోఒకటి మాట్లాడుతూ నడిచిన వ్యక్తిమాత్రం లేదు. తనను హింసించి లొంగదీసుకుని అతను ఆశించినదానిని అనుభవించి తన దారి తాను చూసుకున్నాడు. తాను

జీవితంలో ఒడిగట్టని పనిలోకి, రొంపిలోకి తనను దించాడు. తన మనసును మనసుతో ముడివేయకుండా కేవలం శరీరాన్ని మాత్రమే ముడివేసి దాన్నీ విప్పుకుని వెళ్ళిపోయాడు.

నాలుగోరోజు, ఎక్కడినుంచో ఊడిపడ్డట్లు అనంతం ఆమె వైపు రావడం ఆమెకు ఆశ్చర్యం కలిగించింది.

"మీరూ మార్నింగ్ వాక్ మొదలుపెట్టారా ఏమిటి?" అనింది.

"ఏ పనీ లేక సోమరి జీవితం గడుపుతున్నా కదండీ నెలల కొలదీ? అలా గడుపుతుంటే శరీరం అదుపు తప్పుతుందేమోనని భయపడి మొదలుపెట్టాను. మీరేంటి ఒక్కరూ నడుస్తున్నారు?"

"ఒక్కరూ అంటే?"

"కృపా గారు పక్కనుండాలి కదా అని."

ఊపిరి భారంగా పీల్చి వదిలేసింది.

"ఆయన ఏడుగంటలయితే గాని నిద్రనుంచి కన్ను తెరవరు. ఏడుంపావైతేగాని మంచం మీది నుంచీ లేవరు. పైగా తరచూ క్యాంపులు కదా! ఎప్పుడు రావడానికి వీలుంటుందో, ఎప్పుడు రావడానికి వీలుండదో ఇద్దరికీ తెలియదు. అయినా బీచిలో నడవడానికి తోడవసరమంటారా?"

నవ్వి ఊరుకున్నాడు.

"మీతో కలిసి నడవవచ్చా?"

"మీ ఇష్టం; నాకు ఇబ్బంది లేదు," ఖాతరు లేనట్టుగా అనింది రాయుడు గుర్తుకొచ్చి.

"మాట్లాడుతుంటే మనసు పెట్టలేము నడక మీద. మనసు పెట్టవలసిన అవసరం ఉందొ లేదో కూడా నాకు తెలియదు. పక్కన నడుస్తుండగా మాట్లాడకుండా ఉండలేము."

"ఆహా!"

"మీకు ఆ విషయంలో అభిప్రాయమంటూ లేదా?"

"ఆ విషయం ఒక అభిప్రాయాన్ని కలిగి ఉండేంత ముఖ్యమైనది కాదేమో."

"మీతో జాగర్తగా మాట్లాడాలి; ఒళ్ళు దగ్గిరపెట్టుకుని."

"అంత తొందరగా అభిప్రాయాలు ఏర్పరచుకోకండి నా గురించి."

అతనితో కలసి నడవటం ఇష్టం లేదు. యాయాథృచ్ఛికంగా కలిశాడు. రేపటినుంచి కలియకపోవచ్చేమోలే అప్పుడప్పుడూ తప్పితే. పురుషుడికి దూరంగా ఉంటూ వచ్చింది కృపాతో సంబంధం ఏర్పరచుకున్న తరువాత. సుడిగుండంలోకి రాయుడు లాగచూసినపుడు ప్రతిఘటించింది. అతను ఆ ప్రయత్నం మానుకున్నట్టు కనిపించగానే తాను ఐచ్ఛికంగా లొంగిపోయింది. మరో వివాహేతర సంబంధానికి తాను సిద్ధంగా లేదు.

ఆమె ముభావంగా మాట్లాడటం గమనించాడు. అదేమీ అనూహ్యమైనది కాదు. ఒక పురుషుడి ప్రభావం నుంచీ రెండు రోజుల్లో బైటపడగలదనుకోడం మూర్ఖత్వం – అనంతం మూర్ఖుడు కాదు. గుర్రం తనకు కొత్తది; అది మొదట మొరాయిస్తుంది అని మొరటుగా అనుకున్నాడు. ఈ గుర్రం మీద పందెం కట్టాడు. అతని పట్టుదలకు పరీక్ష. తిట్టినా, మొట్టినా భరించడానికి మనసు నిబ్బరమైనది. అతని మనసుకు గాయాలవ్వవు. పన్నాగాలకు అది నెలవు. ఆమె ఏమీ మాట్లాడకుండా నడుస్తోంది. రోడ్డుకు తగిలి బూట్లు శబ్దం చేస్తున్నాయి. ఆమె అంత గంభీరంగా నడవడం కాస్త నిరుత్సాహంగా ఉంది అనంతానికి. తాను కల్పించుకుని మాట్లాడితే అది కృతకంగా ఉండటమే కాక ఆమెకు తనంటే అనిష్టాన్ని కలిగించవచ్చు. ఇనుము కాలేదాకా ఓపిక అవసరం. తన ప్రయత్నం విఫలం అవ్వకూడదు, అవ్వకూడదు, అవ్వకూడదు – మూడుసార్లు అనుకున్నాడు. హవామహల్ దగ్గరకు వచ్చి వెనుదీయబోతున్నపుడు గాని తాను మౌనంగా అంత దూరం నడిచానన్న విషయం గమనించలేక పోయింది. తన పక్కనే అనంతం మొరగని కుక్కలా నడిచాడన్న విషయం గమనించింది. జాలిపడ దలచుకోలేదు. ఈరోజు ఇలా చేస్తే రేపటినుంచి తనతో నడిచే ప్రయత్నం చెయ్యడు. అయినా రేపటినుంచి తనకై ఎదురుచూసి తాను రాంగానే తనతో ఈరోజులా కలిసి నడుస్తాడన్న భావన తనకు ఎందుకు కలిగిందో ఆమెకు అర్థం కాలేదు. ఒక భయం ఏ మూలో పొంచుండి ఆ ఉద్దేశానికి దారి తీసుంటుంది. ఏది ఏమైనా ఆమె మరో 'ప్రేమ' క్రీడకు సిద్ధంగా లేదు. దానికీ ఒక అస్పష్టభయం కారణంగా తోచింది ఆమెకు. మరో 'ప్రేమలో' తానుపడితే పడిన మరుక్షణం నుంచీ తనకై మృత్యువు కనపడకుండా ఎదురు చూస్తుండవచ్చు. తనకు బతకడమంటే ఎంతో ఇష్టం. బతుకు ఒక వరం. మనుషులు జీవితంలో తారసపడుతుంటారు, మనసులోకి తొంగి చూస్తుంటారు, తొలగిపోతుంటారు. వాళ్ళెవరూ తాను ప్రేమించిన తన జీవితంకన్నా అధికులుకారు. తన జీవితంకన్నా అధికుడు తన మనసులో తిష్ట వేసుకునే అవకాశం లేదు. అలా జరగకుండా తాను శాయశక్తులా ప్రయత్నం చేస్తుంది. ఒకసారి మనసూ, కాలూ జారాయి. అది జీవితంలో ఒకే ఒక అనుభవంగా మిగిలిపోతే చాలు.

స్కూటర్ చేరినతరువాత వస్తాను అనికూడా చెప్పకుండా ఆమె అతన్ని వదిలేసి వెళ్ళిపోయింది. అనంతం సముద్రంవైపు వెళ్ళాడు. ఇసుకలో కూర్చున్నాడు. మెత్తని హాయినిస్తోంది ఆ ప్రాణంలేని పదార్థం. కంటి నిండుగా సముద్రం. చెమటను ఆర్పుతున్న వెర్రి గాలి. ఆమె సరిగ్గా మాట్లాడక పోవడంగాని, మొరటుగా వదిలేసి చెప్పాపెట్టకుండా వెళ్లిపోవడం గాని అతను పట్టించుకోడం లేదు. ఆమె మనసును అతను తొందరపెట్ట దలచలేదు ఏ విషయంలోనూ. గుఱ్ఱానైనా, మనిషినైనా మచ్చికచేసుకోవాలి. ఆలోచన ఒకసారి ఆమె మనసులో పుడితే అదే ఆమెను తొలిచి వేస్తుంది. ఆమెకు శారీరకంగా చేరువగా ఉండటానికి ఏమాత్రం వీలున్నా దాన్ని వినియోగించుకోవాలి. అతను అతని అందాన్ని పెట్టుబడిగా పెట్టదలచాడు తన లక్ష్యాన్ని చేరడానికి. లక్ష్యాలు శిలలా ఒకచోట పడుండవు. పడున్నా అవసరాన్నిబట్టి వాటిని జరుపుకు పోవాలి. మనిషి వాటిని చేరే ప్రయత్నం చేసుకుంటూ పోవాలి.

మరుసటిరోజు కనిపిస్తాడేమో ననుకుంది సుమతి. తన మనసును గ్రహించి తన దారిని తాను పోతున్నాడేమోలే అనుకుంది. అతను ఒక వేళ కావాలని తనతో కలిసి నడవాలని అనుకోలేదుగదా అన్న ఆలోచన వచ్చింది. తాను ఈ వేళకు వచ్చి నడుస్తానని, ఒంటరిగా ఉంటాననీ తెలిస్తేనే కదా అనంతం ఒక పథకం ప్రకారం తనను కూడె ప్రయత్నం చేయగలడు? అతన్ని మొదటిసారి చూసినప్పుడే మంచి కుర్రాడు అన్నభావన కలిగింది. అతని పేదరికం కూడా అతనిపట్ల సానుభూతిని కలిగించునది. మరి అతని అందం అతనిపై సదాభిప్రాయం కలిగించలేదా? ఆ ప్రశ్న ఆమె మనసులో తలయెత్తకుండా ఉంటే బాగుండు అనుకుంది. అలాంటి ఆలోచన వచ్చినందుకు తన మీద తాను విసుక్కుంది. భ్రాన్తులు, అనుమానాలూ తన మనసులో ఎక్కువవుతున్నట్లుంది. మనిషి మనసును అదుపు కొంతవరకే చేయగలడు. రాయుడితో కలిగిన అనుభవం వలన ప్రతి మనిషిలోనూ రాయుడిని చూస్తోంది. దీనికి రాయుడు ఫోబియా అని నామకరణం చెయ్యవచ్చు. స్టాకోమ్ సిండ్రోమ్ ఆమెను రాయుడికి లొంగిపోయేట్టు చేసింది. అతనికి మనసులను చదవడం బాగా వొచ్చు. కురూపి అందగత్తెలకన్నా అదృష్టవంతురాలయుంటుంది. కుక్కలు వెంటపడవు అంతగా. తొడలమధ్య ఎముక వుంది.

ఒకవేళ ఈరోజు కనిపిస్తే కాస్త అభిమానంగా పలకరిద్దామనుకుంది. తన నిన్నటి అపరాధానికి పరిహారమవుతుంది అది. ఆమె అటు చివరకు వెళ్లే వరకూ అతను కనబడలేదు. మొదటిరోజుతోనే నడకమీద ఆసక్తి నశించి మానేశాడేమో అనుకుని నవ్వుకుంది. తానూ అంతే; ఆరంభశూరత్వ కారణంగా అనేకసార్లు మొదలెట్టి ఒకటి రెండు రోజులతోనే నడకకు ఎగనామం పెట్టేది. అతను టైం మార్చుకుని ఉండొచ్చు. అతని సంగతి తనకెందుకు? రొప్పుకుంటూ అటునుంచీ వస్తూ ఆమె కళ్ళబడ్డాడు. తనలోని సందేహాలకు సమాధానం దొరికిన సంతృప్తి కలిగింది.

"వేగం కాస్త తగ్గిస్తే, రొప్పవలసిన అవసరం ఉండదు," అనింది.

అతను నవ్వును సమాధానంగా ఒదిలి తన దారిని తాను వెళ్ళాడు.

ఆమె వెళ్లినప్పటిలా ఒంటరిగానే వేగంగా నడిచింది తిరిగి వచ్చేటప్పుడు. కొత్తగావుంది ఆమెకు నడక. జంటగా నెలలకొలది నడిచిన గతానుభవం కారణంగా. గుండెల్లో ఏదో కలుక్కుమంది.

తరువాత రోజు అనంతం గురించీ చూసింది. వెళ్ళేటప్పుడు, వచ్చేటపుడూ కూడా అతను తారసపడలేదు. తన నడకతోపాటు ఇన్నాళ్లు ఎదురుచూడటానికి, సాన్నిహిత్యానికీ అలవాటుపడింది. పావ్లోవ్ కుక్క గుర్తుకొచ్చింది. జీవితంలో అనుక్షణం ఏదో ఒక అంశంలో కాస్తో కూస్తో మార్పుండకపోదు; కానీ అది మార్పు లేనిదిగా అనిపించి విసుగుదలను కలిగిస్తుంది. రాయుడు తన జీవితంలో బలవంతాన, పాశవికంగా జొరబడాలని ముందు చూసి తన అనుమతితో తనలో చోటుచేసుకున్నపుడు అది ఒక పెనుమార్పు; నిష్క్రమించడమూ అంతే. రెండూ ఏదో ఒక విధంగా బాధించినవే. తోడులేని నడక మరో రెండు రోజులలో సాధారణమవుతుంది. అంతవరకూ కాస్త కొత్తగానూ, కాస్త బాధగానూ ఉంటుంది.

గతానుభవపు ఆలోచనలూ కాస్తో కూస్తో మూగకపోవు. ఇంతకూ అనంతం కనబడకపోవడానికి కారణమేమిటో; కేవలం రాకపోవడమేనా, లేక కావాలని కనబడటం లేదా?

మరో రోజు వచ్చింది. మొన్నటి దినాన జరిగినట్టే అతను అవతల చివర దర్శనమిచ్చాడు.

“ఏమీ, నిన్నరాలేదా?"

"రాలేదు," అంటూ వెళ్ళిపోయాడు.

వెళ్లిపోతున్న అతన్ని ఆమె ఆగి వెనకనుంచి చూసింది. దర్పంతో నడిచిపోతోంది అతని ఆకారం.

ఐదోరోజున ఆమె బయలుదేరే చోటునుంచే అతనూ ఆమె బయలుదేరడం జరిగింది.

"ఒస్తానండి," అని అతను దూసుకుపోబోయాడు.

"ఎక్కడికి వెళతారు? నాదీ మీ వైపు ప్రయాణమే కదా; మీ అంత వేగంగా నడవలేనని అభిప్రాయమా ఏమిటి?" అనింది.

అనంతం మనసు పిల్లిమొగ్గవేసింది. మైండ్ గేమ్ ఆడాడు. ఫలించింది. కలిసి నడిచారు. అవీ ఇవీ అతని గురించే అడిగింది. ఇలాచెయ్యి కూడదా, అలాచేయకూడదా అంటూ వాటికి సమాధానాలు రాబట్టింది. తనకు అతని శరీరం అడ్డొస్తుందేమోనని వినయంగా, జాగ్రత్తగా నడవడం గమనించింది. వేరే వ్యక్తి శరీరం, వేరే మనస్తత్వం ఆమె పక్కన చేరింది. రోజుల ఒంటరితనం తరువాత మరొక తోడుతో నడుస్తుంటే మనసులో ఈ వేళ నెలవంక వచ్చి చీకటి సూక్ష్మంగా పలచబడినట్లనిపించింది. ఆ వేళ ఇద్దరూ కలిసి వేలాది అడుగులు వేశారు.

కృపారావు కాంపుకు వెళ్లి పన్నెండు రోజులు గడిచిపోయింది. వెళ్ళినప్పుడల్లా లాభంతో తిరిగి వస్తుంటాడు. ఆ లాభం పూర్వోత్తరాలు భార్యతో పంచుకుని చిన్నపిల్లలు చాకోలెట్లు దొరికినపుడో, కొత్త ఆటవస్తువులు దొరికినపుడో మురిసినట్టు మురిసిపోతుంటాడు. ఆ లాభం ఆమెకు అంతగా ఆనందం కలిగించదుగాని, అతనిలో ఉప్పొంగే అతని ఆనందం ఆమెకు సంతృప్తినిస్తుంది; అతనంటే ఇష్టం ఉండటం చేత. అతనిలో అప్పుడప్పుడూ తొంగిచూసే అమాయకత ఆనందాన్నిస్తుంది. అతనికి కష్టం కలిగించకుండా ఆమె ప్రవర్తించలేక పోవచ్చు; అది వేరే విషయం.

"కృపారావు గారు ఎప్పుడు వస్తారు?" అడిగాడు ఒకరోజు అనంతం.

"నిన్ననే రావలసింది. అతనికి అనుకోకుండా పని తగిలింది. రేపు లేక ఎల్లుండి వస్తారు."

"మీకేలాఉందో గాని, నాకు కృపాగారిని చూసి ఒక యుగం అయినట్టుంది," అన్నాడు.

"నిజం?"

"సందేహించక్కరలేదు. అబద్ధం అవసరమైనపుడు కదా ఆడాలి."

"నిజం?"

ఉన్నట్లుండి మబ్బులలో చురుకుదనం హెచ్చింది. వేగంగా వాహనాలు దూసుకుపోతున్నాయి. కాలినడకన ఉన్నవాళ్లూ గేర్ మార్చారు.

"దొరికిపోయేట్లున్నాం," అన్నాడు.

"దొరికాం."

మొగ్గలాంటి గొడుగు విరిసింది. గాలి దాన్ని అతలాకుతలం చేస్తోంది. మృదంగాన్ని వేళ్ళు తాకీతాకనట్లు పెద్దపెద్ద చినుకులు గొడుగు మీద రాలుతున్నాయి.

" గాలి ఒకపక్క. చిల్లులు పొడిచేట్టు చినుకులు మరోపక్క ఆగుతుందా ఈ షోకుల గొడుగు? లోపలికి వస్తారా?"

"వద్దులేండి. తడవడం నాకు సరదా."

"అలా అయితే, బీచ్ లో కాసేపు కూర్చుని వచ్చేయండి."

"మీరు ఒంటరి వారై పోతారు."

"గొడుగులో నేను నా పక్కన పొంటెనులా నడుస్తూ మీరు. నవ్విపోతారు చూసేవాళ్ళు. పెద్దదయింది వాన, కరి మబ్బులు కరిగి."

"కరి లేక కర్రీ?"

"కర్రీ అన్నా నష్టంలేదు నలుపు అంటే చులకన భావం లేనట్లయితే. ఒక ఛాయ హెచ్చి ఉంటే నేను అదే అయ్యేదాన్నేమో."

" నమ్మండి నాకు చులకన భావం లేదు. అన్ని రంగులూ, తెలుపుతో సహా అందమైనవే. నాకు చెందినంతవరకు నలుపు మనిషిలో ఒక పాలు అందాన్ని అధికంగా చూడగలను."

"మరీ ఎక్కువయింది. నాకు అభ్యంతరం లేదు మీరు గొడుగు కిందకు వస్తానంటే. మైలపడిపోను."

"ఇలా అయితే స్వేచ్ఛగా నడవచ్చు. మీకూ నాలా నడిచే వీలుంటుంది."

"నీటికి మీ విలువైన శరీరం కరిగి పోతుందేమో జాగ్రత్త."

"ఏడవటానికి ఎవరూ లేరు కనుక పర్లేదు నీటి పాలైనా నిప్పు పాలైనా."

"మీరు మీ గురించి లేరా ఏమిషి?"

"ఉన్నా. కేవలం నా గురించే ఉంటా. ఎవరి గురించీ లేను. బ్రతికే స్వేచ్ఛ, మరణించే స్వేచ్ఛ రెండు ఉన్నాయి. ప్రపంచం నా గురించి ఉండాలి; దాని గురించి నేను లేను. ప్రాణం ఉన్నంత వరకే కదా ఆ సంబంధమూనూ; నా గురించీ నేనుండటమూనూ. మృత్యువు బాధించకుండా తీసుకు పోతానంటే నాకు అభ్యంతరం ఎందుకుండాలి? అది నిర్హేతుకంగా తీసుకుపోతుందని నేను అనుకోను."

ఆ మాటలు దీనంగా ధ్వనించాయి ఆమె చెవులకు. తనకు ఎడమగా నడుస్తున్న ఆ ఒంటరి మీద సానుభూతి కలిగింది.

"నాకు ఇబ్బందని గొడుగు కిందకి రావడం లేదా లేక సిగ్గు అడ్డొస్తున్నదా?"

"సీగ్గూ, ఎగ్గూ లేవు. సిగ్గు సింగారాన్ని ఎప్పుడు వెలివేస్తే అప్పుడు అరమరలో పెట్టేసుకో వచ్చు. అది అసలే లేక పోతే ఎంతో స్వేచ్ఛ. స్వేచ్ఛ మహదానందాన్ని ఇస్తుంది కదా."

"మన స్వేచ్ఛ కు హద్దులు ఉంటాయి కదా. ఒకరి స్వేచ్ఛ మరొకరి స్వేచ్ఛకు అడ్డు రాకూడదు అన్నది బాధించ కూడదు అన్నది మానవ సమాజంలో మౌలిక హద్దులు."

"ఇతరుల గురించి నేను ఆలోచించ దలుచుకోలేదు; ఇతరులూ నా గురించి ఆలోచించిక్కర లేదు."

"గొడుగులోకి రావయ్యా అంటే మీకు, నాకు ఇబ్బంది అన్నావు: నీ ఒకడికే ఇబ్బంది అని చెప్పండొచ్చుగా, ఇతరుల సంగతి నీ కక్కరలేకపోతే?"

"నా మాటలకు విపరీతార్థం తీశారు."

గొడుగు ను పక్కకు వాల్చి అతని తలపై ఉంచింది తాను తడుస్తూ.

"భలేవారే! మీరు చిలిపి వారు అంటూ అతను తన ఎడమ చేత్తో గొడుగును పట్టివున్న ఆమె చేతిని గొడుగు లోని ఇద్దరికీ పనికొచ్చేలా వాల్చాడు. ఒకరి భుజం మరొకరి భుజానికి తగులుతోంది. ఆమె వెలుపలి భుజం, అతని వెలుపలి భుజం తడుస్తున్నాయి.

"గొడుగు బరువు నాకు వదిలేయండి." అన్నాడు.

"గొడుగు బరువా?"

"గాలికి లేచి పోకుండా, విరిగిపోకుండా పట్టుకోవాలి గా."

ఆమె స్వేదపు వాసన, జుత్తు వాసనా, రాత్రి పెట్టుకొని పొద్దున తీసేసిన మల్లెమాల వదిలిన పరిమళం మిళితమై గొడుగును నింపుతున్నాయి.

"ముద్దయి పోతున్నారేమో. ఈ గొడుగు అలంకార ప్రాయం. తలకు మాత్రం ఉపయోగపడుతుంది."

"రైన్ కోటు తెచ్చుకోవలసింది."

"వర్షం రాదులే అనుకుంటూ, ఎందుకైనా మంచిది అన్న అభిప్రాయంతో ఇది ఎదురుగా కనిపిస్తే తెచ్చాను. కొంతయినా ఉపయోగపడుతుంది కదా?"

"చాలా ఉపయోగపడింది."

మబ్బులు విడిపోయి ఎవరో ఈత కొడుతున్నపుడు చేతులతో నీటిని తోసేసినట్లు జరిగిపోతున్నాయి. నీలాకాశం అక్కడక్కడ స్వచ్ఛంగా కనిపిస్తోంది కడిగేసినట్లు.”

"మనల్ని తడపడానికి వచ్చినట్లుంది వాన."

తేమ గాలి సముద్రం మీద నుంచి తోసుకు వస్తోంది ఒడ్డుకు. ఆమె జుట్టు చిందరవందర అవుతోంది. కొన్ని వెంట్రుకల చివరలు అతని బుగ్గకు తగులుతున్నాయి.

"నాలుగు అడుగులు వేస్తే మీ వాహనాన్ని చేరుతాం."

ఊపిరి పీల్చి వదిలినప్పటి వక్షంలా లేచి పడుతోంది సాగరం మొత్తంగా. అలలు హాయిగా నాట్యాలు చేస్తున్నాయి, పురివిప్పిన నెమలిలా. కళ్ళు చెదిరే నీలం. అలల తెల్లదనం. యుద్ధంలో ఓడి చెల్లాచెదరువుతున్న సైన్యంలా మబ్బులు.

“రోడ్డు మీద పడి చిందులేస్తున్నాయి చినుకులు. క్రీ గంట ఆమెను చూశాడు. చెదిరిన వెంట్రుకల మీద తుంపరలు. కనురెప్పల చివరలా మెరుస్తున్న తుంపరలు. కుంకుమ కరిగిపోయింది. చూపు ఆమె అతని వైపు తిప్పింది, నల్లటి గుడ్లు మెరుస్తుండగా. కళ్లల్లో తేమ. శిల్పి చెక్కినట్లున చెక్కిళ్లు. చిరునవ్వు నవ్వి తన చూపును తిప్పేసుకున్నాడు. ఆమె మనసులో ఎందుకో ఒక జ్ఞాపకం మెదిలింది. మళ్లీ రాయుడు వెంటపడుతున్నాడు పశువులా.

ఎన్నిసార్లో ఇదే మార్గాన ఎన్నో అడుగులు కలిసి వేశారు. అతనికి ఎలాంటి మానసిక అనుబంధం ఏర్పడలేదు. వాళ్ళిద్దరూ శారీరకంగా కలిసిన రోజు ఎప్పటికీ జ్ఞాపకంగా మిగిలి ఉండేదే; తన నీడలా అది తనతో ఉంటుంది. మంచం చివరకు తన తల ఉంచి వెల్లికలా పడుకుంటే వేసుకున్నా ముడి విడిపోయి మంచం వెనుకకు వేలాడుతోంది. తన మీదకి వంగిఉన్నా అతని చూపుతో తాను చూపును కలిపితే అతని కళ్ళల్లో పశువాంఛ, ఏదో కసి. ఆమె కళ్ళల్లో నీళ్ళు కను కొనల నుంచి జారాయి. ‘ఎందుకా కన్నీళ్లు?’ అని అడుగుతాడనుకుంది. పట్టించుకోలేదతను. అంతకాలం శిఖరం మీద గర్వంగా (అలా ఉండగలిగినందుకు గర్వంగా)ఉండి కాలు జారి దొర్లుతున్నపుడు కన్నీరు పెట్టుకున్నట్లు.

ఆమె స్కూటరు దగ్గరకు వచ్చారు. వర్షం వెలిసింది.

"ఎవరి దారిన వాళ్ళం వెళ్లొచ్చు," అనింది ఆమె గొడుగును మూసి స్కూటర్ బ్యాగులో కి తోస్తూ.

ఆమె తనతో రమ్మని అంటుందేమో అని ఆశించాడు. ఆశాభంగం చెందలేదు. తన లక్ష్యాన్ని చేరడంలో ప్రకృతి అనూహ్యంగా సహాయం చేసింది. తన మీద తనకు నమ్మకం ఉంది. ఆమె తన శారీరక ఆకర్షణ నుంచి తప్పించుకు పోలేదు. శలభం దీపపు ఆకర్షణ నుంచి తప్పించుకోలేరని తెలిసినా తప్పుకుని పోలేనట్లు. ఆమె తనను తనతో రమ్మని అననందుకు తప్పక చింతిస్తుందని అతని నమ్మకం. రోడ్డు ఎక్కి స్కూటరు వీధి చివర కు వెళ్ళే దాకా చూస్తూ నిలబడ్డాడు. ఆమె మలుపు తిరుగుతూ వెనక్కు ఎందుకో చూసింది. అనంతం స్థాణువులా నిలబడే ఉన్నాడు. వెళుతూ అనుకుంది ఒక గొడుగులో అన్ని వందల అడుగులు కలిసి వెళ్లగా లేనిది స్కూటర్ మీద అతనితో ప్రయాణం చేయడం తప్పిదం అవుతుందా అని. తన మీద తాను విసుక్కుంది. అతను తను వెళ్లడం చూస్తూ కదలకుండా ఒకేచోట నిలబడి ఉండిన అతని చిత్రం ఆమెను వెన్నంటు తూనే ఉంది కొన్ని గంటలపాటు. మొరటుగా వ్యవహరించానన్న నిర్ధారణకొచ్చింది. ఒక గొడుగులో ఒక పురుషుడితో వానలో నడవటం మొదటి జీవితానుభవం. 'నా మనసు మళ్లీ గాడి తప్పటం లేదు కదా?'

అతనికి ఏదైనా సాయపడితే బాగుండుననిపించింది. ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉన్నాడన్న విషయం ఎప్పుడో గ్రహించింది. అతని ఆత్మాభిమానం దెబ్బతినవచ్చు డబ్బులు ఇవ్వ చూపితే. మరే సాయం చేయడానికి వీలుంది? తనంటే తనకే భయం, కసి కలిగి మరుసటి రోజు బీచ్ కి వెళ్లడం మానేసింది. అనంతం ఒక చెంప ఎదురుచూస్తూనే ఆమె కావాలని ఈ రోజు రాకపోవచ్చు అనుకున్నాడు. తరువాత రోజు ఆమె గురించి ఎదురు చూస్తూ నిలబడ్డాడు. అతను ఎదురు చూస్తాడని ఎందుకో ఆమెకు అనిపించింది.

"క్షమించండి. మిమ్మల్ని మొన్న నాతో రమ్మని అందామన్న విషయం తట్టక ఒక్కదాన్ని వెళ్ళిపోయాను. మీరూ నాలానే తడిసిపోయి ఉన్నారు. కొన్ని పనులు చొరవగా చెయ్యలేము సాధారణ విషయమైనా స్త్రీ, పురుషులకు సంబంధించి."

"అది స్వల్ప విషయం. నలభై ఎనిమిది గంటల సమయం గడిచిన మీ మనసును వదిలి పోలేదా?"

"మీరు బాధ పడ లేదా? ఎవరికన్నా బాధ కలిగించాన ని అనిపిస్తే నేను బాధపడకుండా ఉండలేను."

"మీరు నాకు బాకీ లేరు గదా మీ స్కూటర్ మీద పరాయి వ్యక్తి ని తీసుకు పోవడం లాంటి సాహసం చేయడానికి. మన మధ్య ఏదైనా స్నేహం లేక మరొకటి ఉన్నప్పుడు కదా మీరా పని చేసుంటే నేను బాధ పడటానికి."

"మరి నేనెందుకు బాధ పడ్డట్లు?"

"మీ మనసును అడిగి సమాధానం రాబట్టుకోవాసినది నన్ను అడిగితే ఎలా?"

"నీ వెళ్లిపోతుంటే అలా చూస్తూ ఉండిపోయారేం నిలబడి?"

"మీరు వెను దిరిగి చూస్తున్నారేమోనని."

"దానివల్ల మీకు కలిసొచ్చే దేమిటో?"

"మీ మనసు తెలుసుకోడానికి."

"ఏం తెలిసింది?"

"నా గురించి ఆలోచిస్తూ ఇంటిముఖం పట్టారని."

"దానివల్ల మీకేం ఒరిగింది?"

"ఒక వ్యక్తి నా గురించి ఆలోచిస్తుందంటే ఎంత ఆనందం! నా గురించి చమరించే నయనంబు కలదు అంటే బ్రతుక్కు ఒక అర్థం ఉన్నట్లు కదా?"

"అతి సామాన్యమైన అంశం నుంచి విపరీతార్థాలు తీసుకొని ఆనందిస్తాం అంతే; అలా ఆనందించే హక్కు మీకుంది."

"సరే లెండి ఆ విషయం వదిలేద్దాం."

"మీకు ఏదైనా సహాయం చేయాలనిపించింది. ఏం చేయగలను?"

"నా పేరున బ్యాంకు ఖాతా తెరిచి కోటి రూపాయలు వేస్తారా?"

"అంత దాతృత్వం లేదు నాలో."

"పోనీ ఎంతుందో చెప్పండి?"

"డబ్బు రూపంలో కావాలా?"

"కేవలం ఆరోజున కలిసి నడిచినందుకే మీలో నాకు సాయం చేయాలన్న భావన కలగడం నాకు ఆనందాన్నిస్తోంది. మీతో ఉన్న పరిచయం కొనసాగనివ్వండి. తరువాత మీరు చేస్తానన్న సాయం గురించి ఆలోచించవచ్చు."

"రెండు రోజులు కొనసాగితే సాయం గురించి ఆలోచించడానికి వీలు ఉంటుందా? రెండు రోజులలో పరిచయం పరిపక్వమై నేడున్న దానికన్నా ఉన్నతమైన దానిగా పరిణమిస్తుందా?"

"రెండు రోజులాగి చూద్దాం," అన్నాడు తట్టుకుని పడబోతూ.

"మీలాంటి సౌందర్యవంతుడికి జీవించడానికి ఏ ఆధరువూ లేకపోవడం విడ్డూరం అనిపిస్తుంది. అలా నాకు అనిపించడమూ విడ్డూరమే."

సౌందర్యవంతుడు అన్నమాటను కాస్త వెటకారంగా అన్నది.

"నా సౌందర్యాన్ని మీకు ధారపోస్తాను. స్వీకరిస్తారా?"

"ఎందుకు కాదంటాను?"

"ఎంత వెలకట్టచ్చంటారు?"

"అమ్మడం ఎందుకూ? నాకు దానం చెయ్యవచ్చుగా?"

"నేను దానంచేయడం ఎందుకు? మీ చెయ్యి కిందవడం ఎందుకు? అనుమతి కూడా అక్కరలేదు, తీసేసుకోండి."

"ఎలాగూ అది సాధ్యంకాదు కనుక ఉదారత మాటలద్వారా ప్రదర్శించుకుంటున్నారు. అయినా నేను మీకు ఏమవుతానని? పురూరవుడు తన యవ్వనాన్ని తండ్రికి ధారాలుపోసినట్టు నాకు మీ అందాన్ని ధారపోస్తానంటున్నారా?"

"నాకు ఇంత దగ్గిరగా వచ్చిన స్త్రీ మరొకరెవరూ లేరు మీరు తప్ప; అందువల్ల నాకలా అనిపించిందేమో. అందం కాకపోతే మనసులు ఇచ్చిపుచ్చుకోవచ్చునేమో."

"అదీ అసాధ్యం!" కటువుగా అనింది.

ఆమె కటువుగా అన్నా అది ఆమెకు సగం అంగీకారం అని అనిపించింది అనంతానికి. ఆమె మనసు డోలాయమానంగా ఉందా?

"మీ గుండెనిండా జాలి నిండి ఉన్నట్టుంది. అంత బలహీనంగా ఉంటె, జీవితంలో ఏవైనా ఒడిదుకులు ఎదురైతే తట్టుకోడం కష్టం కదూ."

"నా గుండెను, నా మనసును, నా శరీరాన్ని, నా బుద్ధిని నేను తయారుచేసుకోలేదు కదా. పుట్టుకతో సంక్రమించినవి. తట్టుకోలేకపోతే గుండె పగులుతుంది. మృత్యువు ఆ రూపంలో వస్తుందేమో, ఏమి చెప్పగలను."

" మృత్యువు సంగతి ఒద్దులెండి. చిరకాలం హాయిగా జీవించండి– మీ గురించి, కృపారావు గారి గురించీ. కృపారావు గారు ఎప్పుడు వస్తున్నారు?"

"ఈరోజు రాత్రికి."

అతను కాసేపు మాట్లాడలేదు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS